క్లుప్తంగా

అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ అప్పలనాయుడు

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామంలో నిర్మాణం పూర్తయిన అంగన్‌వాడీ భవనాన్ని అధికారులు చొరవతీసుకుని ప్రారంభించాలని గ్రామానికి చెందిన ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన ఈ భవనాన్ని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రారంభించకుండా వదిలేశారని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి సౌకర్యాలు లేని అద్దె కొంపలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు చెప్పారు.

నందెన్న ఉత్సవాలు



కోమటిపల్లిలో గద్దె వద్ద కొలువుదీరిన నందెన్న

దత్తిరాజేరు: మండలంలోని పలు గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దీపావళి పండగను పురస్కరించుకుని గురువారం రాత్రి నందెన్నలు కొలువుదీరారు. గదడవలస, కోమటిపల్లి, పెదమానాపరం, మరడాం, గడసాం, తదితర గ్రామాల్లో శివపార్వతులు, నందెన్న ప్రతిమలను దగ్గెల వద్ద ప్రతిష్టించారు. దీపావళి నుంచి నాగుల చవితి వరకు ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం చవితిరోజు రాత్రి దేవతామూర్తుల ప్రతిమలను నిమజ్జనం చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వీడిన నిర్లక్ష్యం



చింతలపాలెం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తుప్పలను తొలిగించిన దృశ్యం

కొత్తవలస: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను అల్లుకున్న పాదులు, తీగలను విద్యుత్‌శాఖ సిబ్బంది శుక్రవారం తొలగించారు. సాక్షి పత్రికలో గురువారం 'అల్లుకున్న నిర్లక్ష్యం' అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు విద్యుత్‌శాఖ సిబ్బంది స్పందించారు. స్తంభాలను చుట్టేసిన తీగలు, పాదులను తొలగించడంతో పాటు వైర్లను సరిచేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

పేదలకు అండగా ఉంటాం..



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కాలువలు, రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఎంపీడీఓ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

15లో పంటబీమా చేయించుకోండి

శృంగవరపుకోట: వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో భాగంగా జీడి పంటకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించిందని ఉద్యానవన శాఖాధికారి అనిత తెలిపారు. జీడిసాగు రైతులు ఎకరానికి రూ.1500 చొప్పున ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. పంటబీమా సౌకర్యం పొందేందుకు 1బీ, ఆధార్, బ్యాంకు ఖాతా, పంట సాగుపత్రం తీసుకుని సీఎస్‌సీలో ఆన్‌లైన్ పోర్టల్ ఈ నెల 15లోగా నమోదు చేయించుకోవాలని అన్నారు.

- పెదవేమలిలో 22 పింఛన్లు నిలిపివేత
- టీడీపీ నేతల ఒత్తిళ్లతోనే తొలగింపు
- మొన్న చిరుద్యోగులు, నేడు పింఛన్ లబ్ధిదారులపై కక్షసాధింపు

పింఛన్లపై టీడీపీ నేతల కుట్ర



పెదవేమలి సచివాలయం

గంట్యాడ: అధికారం వచ్చిన నాటి నుంచి టీడీపీ నేతలు రెచ్చి పోతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు, తటస్థులపై తమ ప్రతాపాన్ని చూపుతున్నారు. నిన్న మొన్నటి వరకు చిరుద్యోగులపై తమ ప్రతాపాన్ని చూపిన నేతలు నేడు సామాజిక పింఛన్ లబ్ధిదారులపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. టీడీపీ నేతల ఒత్తిళ్లతో గ్రామాల్లో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పాఠశాలల్లో పనిచేసే వాచ్ మెన్‌లు, ఆయాలు, వెలుగులో పనిచేసే గ్రామైఖ్య సంఘం సహాయకులు(వీఓఏ)లు, కేజీబీవీల్లో పనిచేసే కుక్, వాచ్‌మెన్‌లను ఆయా శాఖల అధికారులు తొలగించారు. ఇప్పుడు సామాజిక పింఛన్‌పై ఆధారపడే అభాగ్యులపై కూటమి నేతలు కక్ష కట్టారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సొంత మండలంలో టీడీపీ నేతలు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. గంట్యాడ మండలంలో పెదవేమలి గ్రామానికి చెందిన 22 మంది దివ్యాంగులకు పింఛన్లు నిలిపివేశారు. టీడీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు పింఛన్లు నిలిపివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మా పింఛన్లు ఎందుకు నిలిపివేశారని దివ్యాంగులు అడిగితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేసినట్లు సచివాలయ సిబ్బంది చెపుతున్నారని బాధితులు వాపోతున్నారు. దీనిపై సచివాలయ కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావును ప్రశ్నించగా.. 22 మంది దివ్యాంగ పింఛన్లు ఆపేయాలని ఎంపీడీఓ మౌఖికంగా ఆదేశించారని, అందుకే పింఛన్లు నిలిపివేశామని చెప్పారు.

ఎలా బతకాలో తెలియడం లేదు



నాపేరు గండి అప్పారావు. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. నాకు 2011 దివ్యాంగ పింఛన్ వస్తోంది. ఈరోజు నాకు పింఛన్ ఇవ్వలేదు. మా వీధిలోకి పింఛన్ పంపిణీ చేసేందుకు వచ్చిన సచివాలయం సిబ్బందిని అడిగితే నీ పింఛన్ ఆపేశామని చెప్పారు. 13 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాను. ఇప్పుడు ఆపేశారు. ఎలా బతకాలో తెలియడం లేదు.

పింఛనే జీవనాధారం



నాపేరు సింగిడి పాపునాయుడు. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. మత్స్యకారుడిని. నాకు 2013 నుంచి దివ్యాంగ పింఛన్ వస్తుంది. ఈరోజు మావీధిలోకి వచ్చిన సచివాలయం సిబ్బందిని నా పింఛన్ ఇవ్వమని అడిగితే నీ పింఛన్‌ను ఆపేశామని చెప్పారు. నాకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నాకు సెంటు భూమి లేదు. పింఛన్ మీదే ఆధారపడి జీవిస్తున్నాను. నా పింఛన్‌ను ఆపేస్తే నేను ఎలా బతకాలి.

టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు

చీపురుపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 6లోగా అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కావాలని యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు కోరారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయి యూటీఎఫ్ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాల్లో మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లుగా నమోదు కావాల్సి ఉందన్నారు. అర్హత కలిగిన ప్రతీ ఉపాధ్యాయుడు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఓటు వేయడం ద్వారా ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలు సాధించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు ఎ.సత్యశ్రీనివాస్, గొర్లె పద్మావతి, జిల్లా కార్యదర్శి సూరు శ్రీనివాసరావు, మండల ప్రతినిధులు మామిడి శ్రీనివాసరావు, ఆల్తి చంద్రశేఖర్, మద్దిల రాజు, డి.భూపతి, సాయిరాం, మజ్జి వెంకటరావు, యలకల వెంకటరమణ, ఎస్.నారాయణరావు, జీఆర్‌కేఎస్.రాజు పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో బీటీరోడ్డు నిర్మాణం



రాచపేట- సిరిదేవిపురం మధ్య నిర్మించిన బీటీరోడ్డు

మెరకముడిదాం: మండలంలోని రాచపేట గ్రామం నుంచి సిరిదేవిపురం గ్రామం వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన బీటీరోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గతంలో ఈ రోడ్డు మెటల్ రోడ్డుగా ఉండేది. వర్షాకాలంలో దమ్ముమడిని తలపించేది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడేవారు. రహదారి సమస్యను గోల్లవలస సర్పంచ్ గోవింద్, సిరిదేవిపురం సర్పంచ్ అప్పలనాయుడు కలిసి అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. వారు వెంటనే స్పందించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.1.50 కోట్లు మంజూరు చేశారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు పనులు ప్రారంభించారు. అనంతరం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఎన్నికలు పూర్తయిన తరువాత సంబంధిత అధికారులతో ఇరువురు నేతలు మాట్లాడి పనులు పూర్తి చేసేలా చొరవతీసుకున్నారు. ప్రస్తుతం పనులు పూర్తికావడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పాలరైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతపత్రం అందజేస్తున్న పాలరైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, తదితరులు

లక్కవరపుకోట: జిల్లాలో పాలరైతుల సమస్యలను పరిష్కరించాలని పాలరైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొంప కృష్ణమూర్తి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ డెయిరీ ఆవుపాల ధరను తగ్గించి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని వాపోయారు. ఆవుపాల ధరను పెంచి రైతులకు మేలు చేయాలని కోరారు. అలాగే విశాఖ డెయిరీని సహకారం రంగంలోకి తీసుకురావాలని, డెయిరీలో జరుగుతున్న అవినీతిపై స్వతంత్ర్య దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సీఐటీయూ ఎల్.కోట శాఖ అధ్యక్షుడు తరిణి వెంకటరమణ, తదితరులు ఉన్నారు.

దేవుపల్లిలో వైద్య శిబిరం



బొండపల్లి: వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న వర్సిటీ డైరెక్టర్ బాబా శంకర్



గజపతినగరం: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

బొండపల్లి: సెంచూరియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో హెల్త్ కేర్ ఆన్ వీల్స్ సంచార వైద్య శిబిరాన్ని శుక్రవారం వర్సిటీ డైరెక్టర్ బాబా శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. రోగులకు రక్త పరీక్షలు, షుగర్, కొలెస్ట్రాల్, తదితర వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో సంచార వైద్య సేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు చైతన్య, నాయకులు రాపాక అచ్చింనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ముచ్చర్లలో..

గజపతినగరం: మండలంలోని ముచ్చర్ల గ్రామంలో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సుష్మ సుమారు 70 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు వైద్య సేవలందించారు.

రహదారి పనులకు ప్రతిపాదన



రోడ్డును పరిశీలిస్తున్న జేఈ మానస, తదితరులు

వేపాడ: మండలంలోని శింగరాయి నుంచి చందులూరు వరకు రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రాంతాన్ని పీఆర్(పీఐయూ) జేఈ మానస శుక్రవారం పరిశీలించారు. కోమటిచెరువు, ఊర చెరువుల మధ్య నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవటంతో దాన్ని పునఃనిర్మాణానికి, తమ్మయ్య చెరువు అలువ వద్ద కల్వర్టు నిర్మాణానికి, బోని వాని కళ్లాల నుంచి చందులూరు రోడ్డుకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, ఎంపీటీసీ రాజీవ్, గ్రామపెద్దలు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అమరజీవికి నివాళి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రారాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు, విద్యార్థులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో ముందుగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైందని, దాన్ని సాధించేందుకు పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేసి అమరజీవిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు.

'ఈ–శ్రమ్'పై అవగాహన



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న సూర్యారావు

శృంగవరపుకోట: నిర్మాణ రంగంలో ఉన్న కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ–శ్రమ్ కార్డులను వినియోగించుకోవాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు డి.సూర్యారావు పిలుపునిచ్చారు. సీతంపేటలో నిర్మాణ రంగం కార్మికులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఈ–శ్రమ్ పథకంపై కార్మికులకు అవగాహన కల్పించారు. కార్డుదారుకు ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున పెళ్లి ఖర్చులు, ప్రసూతి ఖర్చులు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అలాగే రూ.5 లక్షలు ప్రమాద బీమా, అంగవైకల్యానికి రూ.5 లక్షలు, సాధారణ మరణానికి రూ.60 వేలు, ఇద్దరు పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, వృత్తిలో కావాల్సిన పనిముట్లు ఇస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ విధివిధానాలను కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో కృషి పెయింటర్స్ సంఘ అధ్యక్షుడు షేక్ స్వామి, కార్యదర్శి అప్పారావు, కోశాధికారి అప్పారావు, బాలబంగారమ్మ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు సి.హెచ్.దేముడు, కార్యదర్శి ఎస్.సన్యాసిరావు, లేబర్ ఆఫీస్ ఉద్యోగి తేజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గుర్ల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

అండర్‌పాసేజ్ ఏర్పాటు చేయాలి

గజపతినగరం: మండలంలోని మదుపాడ గ్రామం నుంచి బంగారమ్మ, భూదేవిపేట, పాత బగ్గాం తదితర గ్రామాలకు వెళ్లే మార్గంలో వంతెన లేకుండా ఏర్పాటు చేసిన రైల్వేగేటు వల్ల గజపతినగరం, మెంటాడ మండలాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని బీజేపీ నాయకుడు దేవర ఈశ్వరరావు అన్నారు. స్థానిక రైల్వే గేటు వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ..రైల్వే గేటు పడే సమయంలో గేటుకు ఇరువైపులా గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రైల్వే గేట్ ప్రాంతంలో అండర్ పాస్ వంతెన ఏర్పాటు చేయాలని కోరారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

దత్తిరాజేరు: మండలంలోని పాచలవలస గ్రామంలో పారిశుద్ధ్య పనులు చురుగ్గా చేపడుతున్నట్లు సర్పంచ్ సుమల శ్యామల శుక్రవారం తెలిపారు. గ్రామంలోని అన్ని వీధుల్లో కాలువలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. ఇళ్ల ముందు ఉన్న చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

శృంగవరపుకోట: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద శుక్రవారం కొందరు ఆందోళన చేశారు. నిండు గర్భిణిని ప్రసవం కోసం ఆస్పత్రికి తీసుకురాగా వైద్యురాలి నిర్లక్ష్యంతో పుట్టిన బిడ్డ ప్రాణాపాయ స్థితికి చేరుకుందని వారు ఆందోళన చేశారు. శిశువు వైద్య ఖర్చుల కోసం కొంత మొత్తం సాయం చేస్తామని ఆస్పత్రి యాజమాన్యం హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. దీనిపై గైనకాలజిస్ట్ డా.వరలక్ష్మి వివరణ కోరగా.. వెంకటరమణపేట గ్రామానికి చెందిన గర్భిణి ఈ నెల 23 ఆస్పత్రిలో ప్రసవించిందని, శిశువు గ్యాస్ట్రో స్కిసిస్ (పేగులు బయటకు ఉండటం)తో జన్మించడంతో వెంటనే విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేసినట్లు చెప్పారు. అక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం శిశువును మెడికవర్ ఆస్పత్రికి రిఫర్ చేశారన్నారు. వారం రోజుల తరువాత బాలింత కుటుంబ సభ్యులు తప్పుడు ఆరోపణలతో ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



గంట్యాడ: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కేజీబీవీ ప్రిన్సిపాల్ జ్యోతి



కొత్తవలస: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కొత్తవలస: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్–14 బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో ఎస్.నిహారిక, త్రోబాల్ విభాగంలో పి.సంతోషి ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఎం.పాప శుక్రవారం తెలిపారు. విద్యార్థినులను హెచ్‌ఎం చీపురపల్లి ఈశ్వరరావు, పీడీ–2 ఎ.కనకమహాలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖోలో

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం తొండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల గజపతినగరం మండలం మరుపల్లి పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో అండర్–14 విభాగంలో పాఠశాలకు చెందిన వై.రవి, ఎస్.హారిక, కె.రేఖ, అండర్–17 విభాగంలో సీహెచ్ లావణ్య, బి.దివ్య సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థులను హెచ్‌ఎం కడలి రమేష్, పీడీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.



చీపురుపల్లి రూరల్: రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

కేజీబీవీ విద్యార్థినులు

గంట్యాడ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు కేజీబీవీ విద్యార్థినులు ఎంపికయ్యారు. అండర్–17 ఫుట్‌బాల్ పోటీలకు సీహెచ్.రాజేశ్వరి, టి.నవతేజశ్విని అర్హత సాధించారు. సెపక్ తక్రా అండర్–19 విభాగంలో ఎల్.విజయ, బి.నికిత, అండర్–14 విభాగంలో ఎం.ద్రాక్షాయిని ఎంపికయ్యారు. వీరు ఈ నెల 9,10 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

జాతి ఐక్యతకు సర్దార్ కృషి మరవలేనిది



లక్కవరపుకోట: వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జ్యోతీబా పూలే పాఠశాల సిబ్బంది, విద్యార్థులు



చీపురుపల్లి రూరల్: సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

లక్కవరపుకోట: భారతజాతి ఐక్యతకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ కృషి మరవలేనిదని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాత్రో అన్నారు. జమ్మాదేవిపేట సమీపంలోని జ్యోతీబాపూలే ఆశ్రమ పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి తొలి ఉప ప్రధానిగా, హోం మంత్రిగా ఆయన అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. స్వదేశీ సంస్థానాలను భారత ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

చీపురుపల్లి రూరల్(గరివిడి): భారతదేశపు జాతీయోద్యమంలో ప్రముఖపాత్ర పోషించి, ఉక్కు మనిషిగా పేరు పొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ చేపట్టిన సహాయనిరాకరణ ఉద్యమంలోను, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో వల్లభాయ్ పటేల్ ప్రముఖపాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశ ఉపప్రధానిగా భారతదేశంలో సంస్థానాల విలీనానికి ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు.

ఉచిత గ్యాస్ పథకం ప్రారంభం



మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: ఎన్నికల వేళ చంద్రబాబు ప్రకటించిన ఉచిత గ్యాస్ సిలెండర్ పథకాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. స్థానిక భారత్ గ్యాస్ ఏజెన్సీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై పలువురు లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీపం–2 పథకం లబ్ధిదారులకు ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 1.55 కోట్ల మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూరుతుందన్నారు. గ్యాస్ సిలెండర్ తీసుకున్న 48 గంటల్లో సొమ్ము మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు. కేంద్రం ఇస్తున్న రూ.25లు రాయితీ పోనూ మిగిలిన రూ.876లను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీ టూరిజం బోర్డు మెంబర్ సుబ్బలక్ష్మి, జనసేన ఇన్‌చార్జ్ ఒబ్బిన సత్యనారాయణ, తహసీల్దార్ అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.